
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 19 డిసెంబరు 2024



లా కోర్సులో స్పాట్ అడ్మిషన్లు రేపు

ఎచ్చెర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలోని మూడేళ్ల లా కోర్సులో మిగులు సీట్ల భర్తీకి శుక్రవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్-2024 రాసిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు నిర్దేశించిన తేదీన లాసెట్ ర్యాంకు కార్డు, టీసీ, ఇతర సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. రూ.1,000 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

నాడు



వైసీపీ ప్రభుత్వంలో ఎచ్చెర్ల మండలంలోని తోటపాలెం-ధర్మవరం రోడ్డు

- గుంతలు లేకుండా చేయడమే లక్ష్యం
- జిల్లాలో రూ.31కోట్లతో చేపడుతున్న పనులు
- సంక్రాంతి నాటికి సిద్ధం
- వాహనదారులకు తీరనున్న కష్టాలు
- గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం

నేడు



కూటమి ప్రభుత్వంలో అద్దంలా మారిన తోటపాలెం-ధర్మవరం రోడ్డు

అద్దంలా రోడ్లు

శ్రీకాకుళం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని రోడ్లు అద్దంలా మారుతున్నాయి. గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. సంక్రాంతి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేసింది. నిధులు కూడా కేటాయించడంతో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. జిల్లాలోని రాష్ట్ర హైవేతోపాటుగా జిల్లా ప్రధాన రహదారులకు డివిజన్ల వారీగా ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు అంతటా వేగంగా జరుగుతున్నాయి. గతేడాది డిసెంబరులో వచ్చిన తుపాను, ఈ ఏడాది భారీ వర్షాలు, పలుమార్లు సంభవించిన అల్పపీడనాలు, వాయుగుండం ప్రభావంతో దెబ్బతిన్న కల్వర్టుల స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నారు. కోతకు గురైన రోడ్లను పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే 30 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. ఆర్‌అండ్‌బీ, మున్సిపల్ ఇంజనీర్లు సమన్వయంతో నిరంతరం పనులు చేస్తున్నారు.

వైసీపీ సర్కారు నిర్లక్ష్యం..

వైసీపీ ప్రభుత్వం రహదారులను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల కాలంలో రోడ్లు అత్యంత అధ్వానంగా తయారయ్యాయి. తుపాన్లు, భారీ వర్షాలకు కల్వర్టులు కొట్టుకుపోయాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. ప్రయాణికులు ప్రమాదాల బారిన పడ్డారు. కొన్ని చోట్ల ప్రత్యామ్నాయ మార్గాల్లో ట్రాఫిక్‌ని మళ్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎందరో మృత్యువాతపడ్డారు. వాహనదారుల పడిన అవస్థలు వర్ణనాతీతం. ఎన్డీబీ ద్వారా తీసుకున్న రుణంతో రోడ్ల మరమ్మతులను ప్రారంభించి మధ్యలో నిలిపివేసింది. కనీసం రోడ్లపై గుంతలు కూడా పూడ్చని ప్రభుత్వం అవసరం లేదని ప్రజలు భావించి ఓట్ల రూపంలో వైసీపీకి బుద్ధి చెప్పారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రోడ్ల మరమ్మతులకు రూ.కోట్లను ఖర్చుచేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో చేపడుతున్న పనులు..

జిల్లాలో 241 రోడ్లకు మరమ్మతులు అవసరమని ప్రభుత్వం గుర్తించింది. ఇందుకు గాను రూ.30.61 కోట్లు మంజూరు చేసింది. 938 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు చేపట్టడంతో పాటు వెయ్యి కిలోమీటర్ల పరిధిలో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు (జంగిల్ క్లియరెన్స్) చేపడుతున్నారు. అలాగే 24 కల్వర్టులను నిర్మిస్తున్నారు. ● శ్రీకాకుళం ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలోని రాష్ట్ర హైవేలో 41 పనులు గుర్తించారు. ఇందులో 134 కిలోమీటర్లలో మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చుతున్నారు. ఇందుకుగాను రూ.4.17 కోట్లు వెచ్చిస్తున్నారు. ఇదే డివిజన్ పరిధిలోని జిల్లా ప్రధాన మార్గాల్లో 54 పనులు గుర్తించారు. ఏకంగా 257 కిలోమీటర్ల పొడవున గుంతలను పూడ్చుతున్నారు. ఇందుకుగాను రూ.7కోట్లు ఖర్చుచేస్తున్నారు. ●టెక్కలి ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో రాష్ట్ర హైవేలో 26 పనులు గుర్తించారు. ఇందులో 921 కిలోమీటర్ల పొడవున గోతులు పూడ్చేందుకు రూ.1.63 కోట్లు వెచ్చిస్తున్నారు. జిల్లా ప్రధాన మార్గాలకు సంబంధించి టెక్కలి డివిజన్‌లో 120 పనులను గుర్తించారు. ఇందులో ఏకంగా 455 కిలోమీటర్ల పొడవున గోతులు పూడ్చి.. రోడ్లు వేస్తున్నారు. ఇందుకు రూ.17.83 కోట్లు ఖర్చుచేస్తున్నారు. సంక్రాంతి నాటికి రోడ్లపై గోతులు లేకుండా చేయాలన్నదే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. త్వరలో వాహనదారుల కష్టాలు తీరనున్నాయి.

- పెరగనున్న మార్కెట్ విలువ
- 10శాతం నుంచి 35 శాతం పెంపునకు కసరత్తు
- జనవరి నుంచి అమలుకు చర్యలు
- నేడు జేసీ ఆధ్వర్యంలో కమిటీ సమావేశం
- ఈనెల 20న ధరల జాబితా ప్రదర్శన



భూముల ధరలకు రెక్కలు

నరసన్నపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం భూములు, స్థలాల మార్కెట్ విలువలను పెంచేందుకు కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే రిజస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఐజీ ఎంవీ శేషగిరిబాబు నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లా రిజిస్ట్రేషన్లు- స్టాంపుల శాఖ అధికారులు నివేదికలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. భూములు, స్థలాల విలువలు బహిరంగ మార్కెట్‌లో అధికంగా ఉండగా, రిజస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువ చాలా తక్కువగా ఉంటోంది. దింతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంది. మరోక వైపు ప్రభుత్వ ప్రజా అవసరాల కోసం భూములను కొనుగోలు చేసే సందర్భాల్లో భూములు అమ్మేవారు కూడా తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్ విలువకు, ప్రభుత్వ నిర్ణయించిన ధరలు మధ్య తేడా తక్కువ ఉంటే అమ్మేవారికి, కొనేవారికి నష్టం ఉండదు. ఈ అంశాన్ని పరిగణంలోకి తీసుకొని ఈసారి మార్కెట్ విలువలను జిల్లాలో 10 నుంచి 35శాతం పెంచాలని నిర్ణయించినట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగా రిజస్ట్రేషన్ శాఖ అధికారులు నివేదికలు తయారు చేసినట్లు తెలిసింది. ఆర్డీవోలు, సుడా అధికారులను సంప్రదించి భూ విలువల పెంపునకు చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన మార్కెట్ విలువల కమిటీ సమావేశం కానుంది. ఈ సమావేశంలో అధికారులు తయారు చేసిన నివేదికలపై చర్చించనున్నారు. ప్రజా వ్యతిరేకత కాకుండా భూ విలువలను పెంచాలని ప్రభుత్వం నుంచి మౌఖికంగా ఆదేశాలు రావడంతో ఆ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

●జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో సెంటు భూమి బహిరంగ మార్కెట్లో రూ.వేలల్లో, రూ.లక్షల్లో ఉంటుంది. ఎకరా భూమి రూ.కోట్లు పలుకుతోంది. అయితే రిజిస్ట్రేషన్ శాఖ మార్కెట్ విలువల మాత్రం రూ.వేలు, లక్షలు దాటడం లేదు. దీంతో భూములు మార్కెట్ విలువల పెంపుపై ప్రభుత్వం దృష్టి సారించింది. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఇళ్లస్థలాలుగా మార్పు చెందాయి. సాధారణంగా పట్టణ ప్రాంతాల్లో ఆగస్టు 1న , గ్రామీణ ప్రాంతాల్లో రెండేళ్ల కొకసారి రిజస్ట్రేషన్ విలువలు పెంచుతారు. ఈసారి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో (మిగతా 6వ పేజీలో)

● శ్రీకాకుళం నగర సమీప ప్రాంతాల్లో ఎకరా భూమి బహిరంగ మార్కెట్లో రూ.10 కోట్లు ధర పలుకుతోంది. ప్రభుత్వ ధర మాత్రం రూ.60 లక్షల నుంచి రూ. 80 లక్షలు వరకు ఉంది. నరసన్నపేట పట్టణం వద్ద జాతీయ రహదారి సమీపంలో ఎకరా రూ.40 లక్షలు వరకు ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ ధర ఉంది. కానీ బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ. 4కోట్లు నుంచి రూ.6 కోట్ల వరకు ఉంది. నరసన్నపేట మండలం జమ్ములో ఎకరా రూ.13 లక్షలు ప్రభుత్వ ధర కాగా, బయట మార్కెట్లో రూ.4 కోట్ల నుంచి రూ. 6 కోట్లు వరకు పలుకుతోంది. భూములు కొనుగోలు చేసే సమయంలో మార్కెట్ విలువ ఆధారంగా స్టాంపు డ్యూటీ చెల్లింపులు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం రూ.కోట్ల ఆదాయం కోల్పోతుంది. మరోక వైపు రైతులకు మార్కెట్‌లో భూమి ధరలు పెంచి భరోసా కల్పించేందుకు రిజస్ట్రేషన్లు- స్టాంపుల శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

బిల్లులకు మోక్షమెప్పుడు?

- వంశధారలో ఏ-కేటగిరి పనులు పూర్తయినా చెల్లించని వైనం
- రూ.4.50 కోట్ల బకాయిలు
- ఆరు నెలలుగా నిరీక్షణ



టెక్కలిలో ఏ-కేటగిరి పనులు కింద వంశధార ఎడమ కాలువలో పూడికలు తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

టెక్కలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వంశధార ప్రధాన ఎడమకాలువలో ఏ-కేటగిరి కింద పనులు చేపట్టి ఆరు నెలలు అవుతున్నా కాంట్రాక్టర్లకు ఇంకా బిల్లులు చెల్లించలేదు. టెక్కలి, నరసన్నపేట డివిజన్ల పరిధిలో 112 పనులకు గాను రూ.4.50 కోట్ల బకాయిలు ఉన్నాయి. అప్పులు చేసి పనులు చేపట్టామని, బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులకు వడ్డీలు కట్టలేక పోతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో వంశధార ప్రధాన ఎడమకాలువతో పాటు మరికొన్ని పిల్లకాలువల్లో పూడికతీతలు, జంగిల్ క్లియరెన్స్ ఓటీ రిపేర్స్, గుర్రపుడెక్క తొలగింపు, సైడ్‌వాల్స్ నిర్మాణం తదితరులు పనులు జరిగాయి. నరసన్నపేట డివిజన్ పరిధిలో 71 ఏ-కేటగిరి పనులకు గాను మూడు పనులకు మాత్రమే సుమారు రూ.20 లక్షల బిల్లులు చెల్లించారు. ఇంకా 68 పనులకు గాను రూ.3కోట్లకు పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. టెక్కలి డివిజన్ పరిధిలో 63 పనులు జరగ్గా కేవలం 19 పనులకు సుమారు రూ.10లక్షలకు పైగా బిల్లులు చెల్లించారు. మిగిలిన 44 పనులకు రూ.1.46కోట్లు చెల్లించాల్సి ఉంది. మొత్తంగా వంశధార ప్రధాన ఎడమకాలువ, 48ఆర్, 60ఆర్, 60ఆర్ఎల్, 67ఆర్, 68టీఈ, దేశబట్టి కాలువ ప్రాంతాల్లో కేటగిరి-ఏ కింద పెద్దఎత్తున పనులు చేపట్టారు. టెక్కలి, నరసన్నపేట డివిజన్ల పరిధిలో 112 పనులకు గాను సుమారు రూ.4.50కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇవి కాకుండా వంశధార ప్రధాన ఎడమ కాలువలో శివారు ప్రాంతానికి సాగునీరు వెళ్లేందుకు ఉన్న అడ్డంకులు తొలగించేందుకు అప్పటి జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి 18 పనులకు గాను రూ.22లక్షల పనులను యుద్ధప్రాతిపదికన జరిపించారు. వాటికి సంబంధించి కూడా బిల్లులు చెల్లింపులు జరగలేదు. ఇక వంశధారలో టెక్కలి డివిజన్ (మిగతా 6వ పేజీలో)



హరిపురం: సిరిపురంలో ధాన్యంపై కప్పిన టార్పాలిన్‌పై నిలిచిన నీటిని తోడుతున్న మహిళ



నరసన్నపేట: సుందరాపురంలో వర్షపు నీటిలో వరికుప్పలు

రైతుల ఆశలపై నీళ్లు!

- ఈదురు గాలులు, వర్షంతో తీవ్ర ఇక్కట్లు
- వరి కుప్పల కిందకు చేరుతున్న నీరు
- ధాన్యానికి మొలకలు, కుళ్లుతున్న వేరుశనగ
- పంటలు కాపాడుకునేందుకు ఆపసోపాలు

తుఫాన్లు జిల్లా రైతులను నట్టేట ముంచుతున్నాయి. పది రోజుల్లో వరుసగా మూడు తుఫాన్లు ఏర్పడడంతో తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం అల్పపీడనంతో గత రెండు రోజులుగా జిల్లాలో చిరుజల్లులు కురుస్తున్నాయి. దీనికితోడు ఈదురుగాలులు వీస్తుండడంతో రైతులకు కంటిమీద కునుకులేదు. వరి పంట చివరిదశకు చేరుకోవడంతో అన్నదాతలు కోతలు, మోతలు చేపట్టి పంటను కాపాడేయత్నం చేస్తున్నారు. కొన్నిచోట్ల చిరుజల్లులకు వరిపనలు నీటిలో తడిసిపోయాయి. పోలాల్లో వరి కుప్పలు కిందకు నీరు చేరింది. ధాన్యం రంగు మారుతాయని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. కళ్లాల్లో నిల్వ చేసిన ధాన్యం కిందకు నీరు చేరి మొక్కలు మొలిచాయి. తమ ఆశలపై వరుణదేవుడు నీళ్లుచల్లాడని, వర్షాలకు తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు.

మరిన్ని వివరాలు - 6లో



నందిగాం: సుభద్రాపురంలో నేలకొరిగిన వరిచేను

మానవతావాది!

- 55 మంది అనాథలకు అంతిమ సంస్కారాలు
- పెద్దకర్మ రోజున అన్నదానాలు కూడా..
- అనాథ పిల్లల చదువులకూ అండ
- గొప్పమనసు చాటుతున్న హెచ్‌సీ రామారావు



6లో

ఏపీఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్ 6లో

తుది కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఉత్సాహంగా

- కొనసాగుతున్న పోలీసు క్రీడా పోటీలు
- నేడు ముగింపు

6లో



మానవతావాది!

- 55 మంది అనాథలకు అంతిమ సంస్కారాలు
- పెద్దకర్మ రోజున అన్నదానాలు కూడా..
- అనాథ పిల్లల చదువులకూ అండ
- గొప్పమనసు చాటుతున్న హెచ్‌సీ రామారావు


అనాథ మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలిస్తున్న రామారావు (ఫైల్)

ఇచ్ఛాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి)

● ఇచ్ఛాపురంలోని దాసన్నపేటలో గతేడాది జనవరి 18న 70 ఏళ్ల వృద్ధుడు చనిపోయాడు. సంక్రాంతి సీజన్ కావడంతో ఊరంతా సందడిగా ఉంది. ఆ అనాథ శవాన్ని పట్టించుకునే స్థితిలో ఎవరూ లేరు. కానీ, ఓ హెడ్ కానిస్టేబుల్ తెలుకుల రామారావు స్పందించారు. సొంత ఖర్చులతో మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు చేసి, మానవత్వం చాటుకున్నారు.


శ్మశానవాటికలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రామారావు (ఫైల్)

అయిన వారు కన్ను మూస్తే అంత్యక్రియలకు ముఖం చాటేస్తున్న రోజులివి. కుటుంబంలో వారసుడు లేకపోతే అంత్యక్రియలు చేయడానికి దాయాదులు కూడా ముందుకు రాని పరిస్థితి. తండ్రికి కొరివి పెట్టిన కుమార్తె, భర్తకు కొరివిపెట్టిన భార్య.. ఇలాంటి వార్తలు రోజూ చూస్తుంటాం. ఇలాంటి తరుణంలో ఇప్పటివరకూ 55 మంది అనాథలకు సొంత ఖర్చులతో అంత్యక్రియలు చేపట్టి.. ఓ వ్యక్తి మానవత్వం చాటుకున్నారు. అతడే ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తెలుకుల రామారావు. తాను పనిచేస్తున్న స్టేషన్ పరిధిలో ఎవరైనా అనాథలు మరణిస్తే వారి అంత్యక్రియలు జరిపే బాధ్యతను తీసుకుంటారు. ఇప్పటివరకూ 55 మంది అనాథలకు అంత్యక్రియలు జరిపించారు. పెద్దకర్మ రోజున కొంతమందికి భోజనాలు పెట్టి వారి ఆత్మకు శాంతి చేకూరుస్తున్నారు. పోలీసుల మనసు కఠినంగా ఉంటుందనే అపవాదును పక్కన పెట్టి అనాథలను అక్కున చేర్చుకునే మహా గుణాన్ని సొంతం చేసుకున్నారు. బాల్యం నుంచి ఎదురైన పరిణామాలే తనను ఆ పనికి పురిగొలిపాయనేది ఆయన మాట.


కానిస్టేబుల్ రామారావు

● రామారావు స్వగ్రామం మందస మండలం బెల్లుపటియా. కానీ, చిన్నప్పుడే సోంపేట మండలం జింకిభద్రలోని తన మామయ్య ఇంటికి వెళ్లిపోయారు. 1993లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. నౌపడ, నరసన్నపేట తదితర పోలీస్‌స్టేషన్లలో పనిచేశారు. సాధారణంగా కొంతమంది అనాథలు నిరాశ్రయులుగా ఉంటారు. అటువంటి వారు చనిపోతే పట్టించుకునేవారు ఉండరు. మృతదేహాన్ని ఖననం చేయడానికి కూడా ముందుకు రారు. ఇటువంటి పరిస్థితుల్లో అనాథ శవాలకు అంత్యక్రియలు జరపడం అంటే మామూలు విషయం కాదు. కోవిడ్ సమయంలో హైదరాబాద్ నుంచి పశ్చిమ బెంగాల్ వెళుతున్న ఓ గర్భిణీ ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో దిగిపోయారు. పురిటి నొప్పులతో బాధపడుతుండగా సొంత ఖర్చులతో బరంపురం తీసుకెళ్లి ఆస్పత్రిలో రామారావు చేర్పించారు. ఇచ్ఛాపురం కండ్ర వీధిలో ఇద్దరు పిల్లలను దత్తత తీసుకుని చదివిస్తున్నారు. నౌపడలో మరో ఇద్దరు బాలికల చదువు బాధ్యతను చూస్తున్నారు. సీతయ్య ఫౌండేషన్‌లో ఇద్దరు చిన్నారులను దత్తత తీసుకుని వారికి సాయం అందిస్తున్నారు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు కూడా చేయించారు. అయితే సేవా కార్యక్రమాల్లో తన భార్య సరస్వతి సహకారం మరవరానిదని రామారావు చెప్పారు. అనాథల అంత్యక్రియలు జరిపించడం భగవంతుడి కృపగా భావిస్తున్నానన్నారు. కరోనా సమయంలో కూడా రెండు అనాథ శవాలకు దహన సంస్కారాలు చేశారు. సొంత మనుసులు చనిపోతే పట్టించుకోని సమయంలో అనాథలకు దహన సంస్కారాలు చేసి అందరి మన్ననలు పొందారు.


లొద్దపుట్టి గుడి వద్ద సాధువులకు భోజనాలు అందజేస్తున్న రామారావు (ఫైల్)

టీచర్ కాబోయి కానిస్టేబుల్‌గా..

రామారావు ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో బీఈడీ పూర్తి చేశారు. కానీ 1993లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అయినా ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో 1998లో డీఎస్సీ రాశారు. క్వాలిఫైడ్ జాబితాలో ఆయనకు చోటు దక్కింది. కానీ ఫలితాలు కోర్టు వివాదంలో చిక్కుకున్నాయి. తాజా జాబితాలో చోటు దక్కడంతో రామారావు ఆనందం వ్యక్తం చేశారు. పోలీస్ వృత్తిలోనే కొనసాగుతానని, కొద్ది నెలల్లో పదవీ విరమణ చేయనున్నానని రామారావు తెలిపారు.

రైతుల ఆశలపై నీళ్లు!

- ఈదురు గాలులు, వర్షంతో తీవ్ర ఇక్కట్లు
- వరి కుప్పల కిందకు చేరుతున్న నీరు
- కళ్లాల్లో ధాన్యానికి మొలకలు, కుళ్లుతున్న వేరుశనగ
- పంటలు కాపాడుకునేందుకు ఆపసోపాలు


మెళియాపుట్టి: పట్టుపురం వద్ద ధాన్యాన్ని బస్తాల్లో నింపిన దృశ్యం

హరిపురం/నరసన్నపేట/మెళియాపుట్టి/పలాసరూరల్/నందిగాం/జలుమూరు/పాతపట్నం/పోలాకి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో జిల్లాలో గత రెండు రోజులుగా చిరుజల్లులు కురుస్తున్నాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. మందస మండలంలోని డబారు, ఉమాగిరి, మఖరజోల, పితాతొళి, బీఎస్ పురం తదితర గ్రామాల్లో వరి కుప్పలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. ధాన్యంపై పరదాలు కప్పి భద్రపరుస్తున్నారు. నరసన్నపేట మండలంలోని రెడ్డికపేట, కోమర్తి, దేవాది, మడపాం, కిళ్లాం, మాకివలస, జమ్ము, తామరాపల్లి, ఉర్లాం, సుందరాపురం, పారశెల్లి, సత్యవరం, కంబకాయి తదితర గ్రామాల్లో పొలాల్లో వరి కుప్పలు తడిసిపోయాయి. దీంతో ధాన్యం రంగు మారుతాయని రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. కళ్లాల్లో నిల్వ చేసిన ధాన్యం కిందకు నీరు చేరి మొక్కలు మొలిచాయి. సుందరాపురం, చిక్కావలస, మామిడివలస, కంబకాయి గ్రామాల్లో తంపర భూముల్లో వరి కుప్పల కిందకు నీరు చేరడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జమ్ము, దూకలపాడు, కరగాం తదితర గ్రామాల్లో వేరుశెనగ పంటలో నీరు నిల్వ ఉండడంతో విత్తనాలు ఉబ్బిపైకి తేలాయి. ఎకరాలు రూ.20వేలు వరకుఖర్చు చేసి నష్టాపోయామని రైతులు వాపోతున్నారు. మెళియాపుట్టి మండలం పట్టుపురం, తదితర గ్రామాల్లో రైతులు ధాన్యాన్ని కళ్లాల్లో భద్రపరుస్తున్నారు. కొంతమంది తడిచేనునే కుప్పలు వేస్తున్నారు. మరికొంత మంది నూర్పులు చేసి ధాన్యం ఇంటికి తరలిస్తున్నారు. పలాస మండలంలోని ఉద్దానం, గిరిజన ప్రాంతాల్లో ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పారు. నూర్పు చేసిన ధాన్యాన్ని కళ్లాలకు చేర్చారు. కేశుపురం వద్ద ఓదెలను కుప్పలుగా పెట్టారు. నందిగాం మండలంలోని సుభద్రాపురం, తదితర గ్రామాల్లో గాలులకు వరి చేలు నేలవాలాయి. నూర్పులు చేయొద్దని, కళ్లాల్లో ధాన్యాన్ని భద్రపరుచుకోవాలని అధికారులు రైతులకు సూచించారు. పాతపట్నం మండలం బూరగాం, కాగువాడ కొరసవాడ, సీది, తామర, పాశిగంగుపేట, తిడ్డిమి, సరాళి, పెద్దలోగిడి, తెంబూరు ప్రాంతాల్లో రైతులు నూర్పులు నిలిపివేశారు. ధాన్యం బస్తాలకు ఎత్తి భద్రపరచుకుంటున్నారు. పోలాకి మండలంలోని సంతలక్ష్మీపురం, ఈదులవలస, దీర్ఘాశి, డోల, ప్రియాగ్రహారం, గొల్లలవలస గ్రామాల్లో ధాన్యం తడిసిపోయాయి. దీంతో ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే అమ్మకాలు చేపడుతున్నారు. తుపాన్ తమ పాలిట శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


జలుమూరులో ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం


హరిపురంలో వరి కుప్పపై పరదా కప్పిన దృశ్యం


నరసన్నపేట: కామేశ్వరిపేట వద్ద కల్లాల్లో భద్రపరిచిన ధాన్యం


పాతపట్నం: బూరగాంలో బస్తాలకు ధాన్యం ఎత్తుతున్న రైతులు


పలాసరూరల్: కేశుపురం వద్ద వరి ఓదెలు చుడుతున్న కూలీలు


పోలాకి: సంతలక్ష్మీపురంలో ధాన్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం


టెక్కలిలో కాలువ గట్లు బాగు చేస్తున్న దృశ్యం (ఫైల్)

బిల్లులకు మోక్షమెప్పుడు?

(ఐదో పేజీ తరువాయి)

పరిధి 2018-19లో నీరు-చెట్టు కింద చేపట్టిన పనులకు సంబంధించి రూ.3.86 కోట్లు బకాయి ఉంది. ఏ-కేటగిరి పనుల బిల్లులు చెల్లింపులో జాప్యం నెలకొనడంతో కాంట్రాక్టర్లలో మరింత ఆందోళన నెలకొంటుంది. ఇప్పటికే టెక్కలి డివిజన్‌లో కొందరు కాంట్రాక్టర్లు తమ బిల్లులు చెల్లింపునకు కోర్టును సైతం ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఏళ్ల తరబడి నీరు-చెట్టు బిల్లులు, నెలలు తరబడి ఏ-కేటగిరి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపులు జరగకపోవడంతో కాంట్రాక్టర్లు యంత్రాంగం తీరుపై పెదవి విరుస్తున్నారు. వడ్డీలు కట్టలేక అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల బకాయి విషయమై వంశధార ఈఈ బి.శేఖరరావు వద్ద 'ఆంధ్ర జ్యోతి' ప్రస్తావించగా నిధులు మంజూరైతే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. టెక్కలి డివిజన్ పరిధిలో ఏ-కేటగిరి పనులకు సంబంధించి రూ.1.46కోట్లు బకాయి ఉన్నట్లు తెలిపారు.

భూముల ధరలకు రెక్కలు

(ఐదో పేజీ తరువాయి)

కూడా ఈ విలువలు పెరగనున్నాయి. ఈనెల 20న పెంచిన మార్కెట్ విలువలను నోటీసు బోర్డుల్లో ఉంచుతారు. 24 వరకు ప్రజల అభ్యంతరాలు స్వీకరిస్తారు. 26న వాటిని పరిశీలించి, 27న తుది జాబితాకు జిల్లా మార్కెట్ విలువల కమిటీ ఆమోదం తెలపనుంది. జనవరి 1వ తేదీన అమలులోకి రానుంది.

ఏపీఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్

- తుది కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఈఏపీ సెట్-2024 బైపీసీ స్ట్రీమ్‌లో అడ్మిషన్లకు తుది కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైందని సహాయ కేంద్రం సమన్వయకర్త, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ/బీటెక్‌లో బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, ఫుడ్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, బీఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ పూర్తిచేసి సర్టిఫికెట్ల పరిశీలన చేయించుకోవాలన్నారు. ఈ నెల 19 నుంచి 22 వరకు కళాశాలలు, కోర్సుల కోసం వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలన్నారు. 22న ఆప్షన్ల నమోదులో మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. 24న సీట్ల కేటాయింపు వివరాలను కన్వీనర్ ప్రకటిస్తారన్నారు. సీటు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఈ నెల 24 నుంచి 26వ తేదీలోగా రిపోర్ట్ చేయాలని తెలిపారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

- ఎమ్మెల్యే ఎన్ఈఆర్
- రీజనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

ఎచ్చెర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజుల పాటు జరగనున్న ప్రాంతీయ స్థాయి అంతర పాలిటెక్నిక్ -2024 స్పోర్ట్స్ మీట్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల పట్ల కూడా శ్రద్ధ చూపాలన్నారు. క్రీడల్లో ఉత్సాహంగా ఉన్న విద్యార్థులు చదువులో కూడా చురుకుగా ఉంటారన్నారు. సరైన ప్రణాళికతోనే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. క్రీడలతోనే క్రమశిక్షణ, సాయపడే గుణం, ఆత్మస్థైర్యం పెంపొందుతుందని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.జానకిరామయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో నిబిడీకృతమై ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు టెక్‌ఫెస్ట్‌లు, స్పోర్ట్స్ మీట్స్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ విక్టార్‌పాల్, గోపి. గంగస్వామి, సింహాచలం, టీడీపీ మండల అధ్యక్షుడు బెండ మల్లేశ్వరరావు, కూటమి నేతలు ముప్పిడి సురేష్, సంపతిరావు నాగేశ్వరరావు, వావిలపల్లి రామకృష్ణ, పైడి అన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కొనసాగుతున్న పోలీసు క్రీడలు



ఎచ్చెర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో పోలీసు స్పోర్ట్స్ మీట్-2024 రెండో రోజు బుధవారం ఉత్సాహంగా కొనసాగాయి. శ్రీకాకుళం, టెక్కలి, పలాస సబ్ డివిజన్‌లు, ఆర్మ్‌డ్ రిజర్వ్, మినిస్టీరియల్ సిబ్బంది, హోంగార్డులకు చెందిన పోలీసు జట్లు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. క్రికెట్, వాలీబాల్, తగ్ ఆఫ్ వార్, త్రోబాల్, స్లో సైకిల్ రేస్, మ్యూజికల్ చైర్ పోటీలతోపాటు 100, 400 మీటర్ల పరుగు పందెం పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలు గురువారంతో ముగియనున్నాయి. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


పోటీల్లో పోలీసు అధికారులు, సిబ్బంది

సమస్యలు పరిష్కరిస్తాం

జి.సిగడాం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కరించేలా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. బుధవారం నిద్దాంలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. భూములకు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలన్నారు. క్రయ, విక్రయాలకు సంబంధించిన పత్రాలను తీసుకువచ్చి తమ పేరున భూ హక్కులు వచ్చేలా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆబోతుల రాధ, రీసర్వే డీటీ గాయిత్రీ, వీఆర్వో ఉమామహేశ్వరరావు, సర్వేయర్ శాంతారామ్, రైతులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎంపీడీవో బి.శైలజ సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏఎన్ఎంలు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు, ఎనర్జీ అసిస్టెంట్లకు శిక్షణా తరుగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయితీల్లో వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని వాటిని పూర్తి చేయాలన్నారు. గ్రామీణ స్థాయిలో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి సౌకర్యాలు కల్పించాలని ఆమె సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనులను తమ దృష్టికి తీసుకొస్తే ఎమ్మెల్యే గొండు శంకర్ సహకారంతో పూర్తి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సూర్యనారాయణ, సూపరింటెండెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్లకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ శ్రీకాకుళం 1, 2 డిపోలలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్లు అమరసింహుడు, కేఆర్ఎస్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈ నెల 24వ తేదీ లోగా శ్రీకాకుళం 1, 2 డిపోల కార్యాలయాలలో సంప్రదించాలని కోరారు. హెవీ లైసెన్స్ కలిగి 18 నెలలు పూర్తవ్వాలని, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటో, బ్లడ్ గ్రూప్ సర్టిఫికెట్, ఇతర సర్టిఫికెట్లతో రావాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225608, 9959225609, 7982921647, 7382917289 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

గార, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఆర్.జనార్ధనరావు అన్నారు. బుధవారం రాత్రి గొర్లెవానిపేటలో నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా డిజిటల్ అరెస్టులు పట్ల అప్రమత్తంగా ఉండాలని, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి అని సూచించారు. బాల్య వివాహాలు వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

ఆమదాలవలస, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధి ఏడో వార్డు చింతాడలో న్యూలైఫ్ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి ప్రాంగణంలో మహిళలకు కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఆరు నెలలు తమ సంస్థలో శిక్షణ పొందిన మహిళలకు కుట్టమిషన్ల అందించారు. న్యూలైఫ్ టైలరింగ్ సెంటర్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.కృపావరం తదితరులు పాల్గొన్నారు.

మురుగు కూపంలా బట్టుపాలెం

- రోడ్డుపైనే వాడుక నీరు
- ఈగలు, దోమలు విజృంభణ
- ఆందోళనలో గ్రామస్థులు

లావేరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తకోట పంచాయతీ బట్టుపాలెం గ్రామం మురుగు కూపంలో కొట్టుమిట్టాడుతోంది. గ్రామంలోని కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రహదారిపైనే నిలిచిపోతుంది. దీంతో దోమలు, ఈగలుతో అక్కడి ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. దీంతో తరుచూ డయేరియా, విషజ్వరాల బారిన ఆసుపత్రులపాలవుతున్నట్టు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈగ్రామంలో సుమారు 100 కుటుంబాల వరకు జీవిస్తున్నారు. అందరూ వ్యవసాయ కూలీలుగానే జీవనం సాగిస్తున్నారు. పగలంతా రెక్కలు ముక్కలు చేసుకునేలా శ్రమించి సాయంత్రం ఇళ్లకు చేరిన వీరికి.. రాత్రి దోమల బెడదతో సరైన నిద్రరాక నరకాన్ని తలిపిస్తుందని వారంతా వాపోతున్నారు. ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ ప్రాతినిధ్యం వహిస్తున్న గ్రామమే అయినా ఇలా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందంటే ఇక్కడి ప్రజాప్రతినిధులు, అధికారులు పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అయినా తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మురుగు కాలువను తలపిస్తున్న వీధి

సందడిగా కేంద్రమంత్రి జన్మదిన వేడుకలు

రణస్థలం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి జన్మదిన వేడుకలు బుధవారం మండల కేంద్రంలో సందడిగా నిర్వహించారు. టీడీపీ సీనియర్ నేత డీజీఎం ఆనందరావు, దెయ్యం వసతంతరావు, దెయ్యం శ్రీనివాసరావు టీడీపీ కార్యకర్తలతో కలిసి కేక్ కట్ పంచిపెట్టారు.

- అరసవల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడు రోడ్ల కూడలి సమీపంలో గల ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడి జన్మదిన వేడుకలు బుధవారం పండగ వాతావరణంలో కూటమి నాయకులు నిర్వహించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకట రమణ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో చౌదరి పురుషోత్తంనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రణస్థలంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

- నరసన్నపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి కేక్‌కట్ చేసి పార్టీ కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- కవిటి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడి జన్మదినం సందర్భంగా బుధవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ కవిటిలోని చింతామణి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి రామయ్యపట్నుగలో కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.
- పాతపట్నం డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



ఢిల్లీలో కేక్ కట్ చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

అధునాతన టెక్నాలజీతో ఇంధన పొదుపు

ఎచ్చెర్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అధునాతన టెక్నాలజీతో ఇంధనం పొదుపు చేయొచ్చని ఏపీఈపీడీఎల్ ఈఈ పి.యోగీశ్వరరావు అన్నారు. వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో బుధవారం జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంప్రదాయ ఇంధన వనరులు పరిమితంగా ఉన్నాయని చెప్పారు. శక్తి పరిరక్షణను ప్రోత్సహించడానికి, లైట్లు అవసరం లేనప్పుడు ఆపివేయాలన్నారు. లైటింగ్ సర్క్యూట్‌ను ఆన్, ఆఫ్ చేయడానికి ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్స్, మోషన్ సెన్సార్స్, ఆటోమెటిక్ టైమర్‌లు, డిమ్మర్లు సోలార్ సెల్‌లను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌పీవీ రమణమూర్తినాయుడు, ఈఈ(టెక్నికల్) సురేష్‌కుమార్, డీఈఈ జీవీ రమణమూర్తి, ఏఈ ఎస్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

జి.సిగడాం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ తనిఖీ అధికారి వెంకటరమణ హెచ్చరించారు. బుధవారం జి.సిగడాం, పాలఖండ్యాం, వాండ్రంగి తదితర ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాలలో స్టాక్‌ను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. ఎరువులు, పురుగుమందులు రైతులకు అందుబాటులో ఉంచడంతో పాటు సరైన ధరకు అమ్మాలన్నారు. కల్తీ ఎరువులు, మందులు అమ్మిన షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట ఏవో శారద ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఏవో, సిబ్బంది

సంక్రాంతికి గ్రామాల్లో పండగ వాతావరణం



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి వీధికి సీసీ రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసి సంక్రాంతి పర్వదినానికి ముందే పండగ వాతావరణం కల్పిస్తామని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. బుధవారం లంగాలవలసలో వేసిన సీసీ రోడ్డును ఆయన పరిశీలించారు. గత ప్రభుత్వం హయాములో అభివృద్ధి పూర్తిగా కుంటిపడిందని, కూటమి ప్రభుత్వం పాలనలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలు ఉన్నా కూటమి నాయకుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు ముప్పిడి సరేష్, లుకలాపు అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

జి.సిగడాం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమన్వయంతో గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో జి.రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించిన శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు.

సంపద కేంద్రంగా మార్చాలి



వర్మీ కంపోస్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమణ

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో సేకరిస్తున్న చెత్త ద్వారా తయారు చేస్తున్న వర్మీ కంపోస్టు ద్వారా సంపద సృష్టించాలని డివిజనల్ పంచాయతీ అధికారి ఐవీ రమణ అన్నారు. ఈ మేరకు బుధవారం సింగుపురం ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం) సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ.. చెత్త సేకరించే సమయంలో తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించాలని, తద్వారా వర్మీ కంపోస్టు ఎరువు తయారీకి సులభంగా ఉంటుందని తెలిపారు. సింగుపురం పంచాయతీ కార్యదర్శి ఎ.రమేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వైదేహి, జూనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ, క్లాప్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ నాయుడు సేవలు చిరస్మరణీయం

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వ్యాపారవేత్తగా ఎదిగి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములైన డాక్టర్ ఎస్పీ నాయుడు సేవలు చిరస్మరణీయమని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి అన్నారు. ఎస్పీ నాయుడు జయంతి సందర్భంగా ఫాజుల్‌బాగ్‌పేటలో ఉన్న ఆయన విగ్రహానికి అతని కుటుంబ సభ్యులతో కలిసి కృపారాణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ నాయుడు భార్య డాక్టర్ సనపల సత్యవతి, కుమార్తె డాక్టర్ శ్రీజ, సూర శ్రీను, నటుకుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎరువుల దుకాణాల తనిఖీ

బూర్జ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాలను ప్రత్యేక అధికారిణి జి.సత్యవతి బుధవారం తనిఖీలు చేపట్టారు. వంద రోజుల పైబడి ఆన్‌లైన్‌లో అమ్మకాలు చూపించని దుకాణాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. సకాలంలో డీబీటీ చేయ కపోతే ప్రభుత్వం నుంచి సరఫరా చేసే కంపెనీలకు సబ్సిడీ చెల్లించడంలో జాప్యం జరుగుతుందని, డీలర్లకు తెలియజేశారు. సకాలంలో అమ్మకాలు ఆన్‌లైన్‌లో చూపించకపోతే దుకాణాలకు రావాల్సిన ఎరువుల కేటాయింపులు కూడా తగ్గిపోతాయని తెలిపారు. దాదాపుగా 15 టన్నుల యూరియా ఎరువులు గత రెండు సంవత్సరాలుగా బూర్జ సొసైటీలో పెండింగ్‌లో ఉన్నట్టు గుర్తించారు. తక్షణమే సరిచేయని పక్షంలో లైసెన్స్ రద్దు చేసి లీగల్ నోటీసులు పంపిస్తామని సొసైటీ ముఖ్య నిర్వహణ అధికారిని హెచ్చరించారు. కొల్లివలస రైతు సేవా కేంద్రంలోనూ, గుత్తావల్లిలో ఉన్న ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. ఏవో ఎస్.శ్రీనివాసరావు ఉన్నారు.



రికార్డులు పరిశీస్తున్న ప్రత్యేకాధికారిణి

మిల్లర్లంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

గుజరాతీపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మిలర్లు ఐక్యంగా ఉంటే మరింత అభివృద్ధి సాధించగలమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిన రమేష్ అన్నారు. స్థానిక మిల్లర్ల సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు చేపట్టి మాట్లాడారు. మిల్లర్లలో బేదాభిప్రాయాలు లేకుండా బాధ్యతలు నిర్వహించాలన్నారు. రైస్ ఇండస్ట్రీ వలన జిల్లాలో చాలా మందికి ఉపాధి ఇస్తున్నట్టు తెలిపారు. మిల్లర్ల సహకారంతోనే సంఘాన్ని మరింత బలోపేతం చేస్తానని స్పష్టం చేశారు. మిల్లర్లంతా స్వార్థం వీడి ప్రభుత్వానికి, రైతులకు మేలు జరిగేలా వ్యవహరించాలని కోరారు. పూర్వపు అధ్యక్షుడు వాసు మాట్లాడుతూ.. తనకు సంపూర్ణ సహకారం అందించిన మిల్లర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మిల్లర్లు బోయిన రమేష్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం శాశ్వత అధ్యక్షుడు కింజరాపు హరివర ప్రసాద్, గొండు కృష్ణమూర్తి, చిన్నాల కూర్మినాయుడు, సుసరాం భూషణ్, తంగుడు జోగారావు, జామి నర్సింహమూర్తి, లాడి రమేష్, తంగుడు నాగేశ్వరరావు, తాలాసు కృష్ణారావు, శాసనపురి మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోయిన రమేష్

నామినేట్ రోల్స్‌లో తప్పులుంటే సరిచేయించుకోండి

గుజరాతీపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి రాస్తున్న విద్యార్థుల నామినేట్ రోల్స్‌లో ఎటువంటి తప్పులుంటే ఆన్‌లైన్‌లో సవరణ చేసుకోవాలని డీఈవో ఎస్.తిరుమల చైతన్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు అపార్‌లో చేసుకోవాల్సి ఉంటుందని, అందులో ఎడిట్ ఆప్షన్‌లో విద్యార్థి పేరు, తండ్రి పేరు, తల్లిపేరు, పుట్టిన తేదీ, లాంగ్వేజ్, మీడియం తదితర అప్షన్లు ఉంటాయన్నారు. వాటిలో తప్పులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు సరిచేయించాలని సూచించారు.

ఆయుర్వేదంతో అన్ని వ్యాధులకు చికిత్స

అరసవల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం చికిత్స ద్వారా అన్ని వ్యాధులు నయం చేసుకోవచ్చని జిల్లా ఆయుష్ విభాగం సీనియర్ వైద్యాధికారి జగదీష్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళా శాల ఆవరణలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఆయుర్వేదంపై అవగాహన కల్పించారు. ప్రాచీన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఆయుర్వేదమని కొనియాడారు. జిల్లాలో 36 ఆయుర్వేద ఆసు పత్రులు, ఎనిమిది జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో చికిత్స అంది స్తున్నట్టు తెలిపారు. ఇంటాక్ కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు, వాకర్స్ మాజీ గవర్నర్ జి.ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ జగదీష్

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

ఆమదాలవలస, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి సాధించవచ్చునని ఏవో మెట్ట మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని కనుగులవలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల యాజమాన్య పద్ధతులు ఎరువులు యాజమాన్యం, పంటల్లో వచ్చే చీడపీడలు, తెగుళ్లను ఏ విధంగా ఎదుర్కోవాలన్న దానిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అపరాల పంటల్లో చిత్తపురుగు వ్యాపించిందని, దీని నివారణపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూక అప్పలసూరన్నాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు పి.సంతోష్, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

గుజరాతీపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ పర్యవరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరి మొక్కలు నాటాలన్నారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శంకర్ నారాయణ, అకడమిక్ కో ఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ పీవోలు ఎస్.రుద్రమరాణి, ఎస్.మాధవిలలత, హేమ పద్మజ, ఇతర అధ్యాపకులు, పాల్గొన్నారు.



క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి


త్రివేణి (ఫైల్)

కోటబొమ్మాళి/టెక్కలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలపరిధి పాకివలస వద్ద జాతీయరహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో టెక్కలి మండలం సన్యాసిపేటలో ఉపాధ్యాయినిగా పని చేస్తున్న సంపతిరావు త్రివేణి (31) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. ఆమదాలవలస మండలం తిమ్మాపురానికి చెందిన త్రివేణి రోజూ బస్సులో కోటబొమ్మాళి వచ్చి అక్కడి నుంచి సన్యాసిపేటకు బైక్‌పై వెళుతుంటారు. ఈ నేపథ్యంలో ఎప్పటిలాగానే బుధవారం కూడా పాఠశాలకు వెళుతుండగా పాకివలస వద్దకు వచ్చే సరికి కంచిలి నుంచి దళ్లవలసలో శుభకార్యానికి వెళుతున్న కారు టైరు పంక్చరై అదుపు తప్పి ఇవతలి రోడ్డు నుంచి డివైడర్ దాటి అవతల రోడ్డుపైకి తుళ్లిపోయి త్రివేణి వాహనాన్ని ఢీకొట్టి కారు సర్వీసు రోడ్డులో బోల్తా పడింది. దీంతో బైక్ పైనుంచి డివైడర్‌కు ఆమె తల తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త కిల్లి సింహాచలం(శివ) ఇండస్ బ్యాంకులో రికవరీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. వీరికి కుమార్తెలు చైత్ర (6), ఇషిక (3) ఉన్నారు. ఈమె ఏడాది కిందటే చిత్తూరు జిల్లా నుంచి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌లో జిల్లాకు వచ్చారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పోలీసులు వెంటనే మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వి.సత్యనారాయణ తెలిపారు. ఉపాధ్యాయిని మృతి చెందిన విషయం తెలుసుకుని ఇటు సన్యాసి నాయుడుపేట, అటు తిమ్మాపురం గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. ఇదిలా ఉండగా టెక్కలి ఎంఈవో ఎం.తులసీరావు, యూటీఎఫ్ నాయకులు కె.దాలయ్య, టి.వైకుంఠరావు మృతదేహం వద్ద నివాళి అర్పించారు.

కారు ప్రయాణికులకు గాయాలు

ప్రమాదానికి కారణమైన కారులో ప్రయాణిస్తున్న కంచిలికి చెందిన గుడ్ల పైడిరాజు, అతని భార్య శైలజలకు గాయాలు కావడంతో మొదట స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ఆటో-ద్విచక్రవాహనం ఢీ: ఒకరికి గాయాలు

పోలాకి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గంగివలస సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గంగివలస కేజీబీవీకి ఆటోలో సరకులు తరలించి తిరిగి వస్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొని వాహనదారుడు అప్పలనాయుడు కాలికి తీవ్రగాయాలయ్యాయి. ఎంపీడీవో కార్యాలయంలో తాత్కాలిక పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుసరాం గ్రామానికి చెందిన అప్పలనాయుడుకు గాయాలు కాగా వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ శ్రీనాథ్ ప్రథమ చికిత్సచేసి ఉన్నత వైద్యం కోసం 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు. ఆటో డ్రైవర్ కోటబొమ్మాళి వాసిగా స్థానికులు చెపుతున్నారు. ఈ విషయాన్ని పోలాకి పోలీసుల వద్ద ప్రస్తావించగా ఎటువంటి ఫిర్యాదు రాలేదన్నారు.

గొప్పిలి వద్ద గుర్తుతెలియని వృద్ధుడి మృతి


గుర్తుతెలియని మృతదేహం

మెళియాపుట్టి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గొప్పిలి గ్రామ సమీపంలో గుర్తు తెలియని మృతిదేశం లభ్యమైనట్లు ఏఎస్‌ఐ నర్సింగరావు తెలిపారు. గ్రామానికి చెందిన కోల్లన సూర్యనారాయణ అనే రైతుకు చెందిన పొలంలో సుమారు 75 ఏళ్ల వయసున్న వృద్ధుడు మృతి చెంది ఉండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా ప్రదేశానికి వెళ్లి పరిశీలించామని ఏఎస్‌ఐ తెలిపారు. సదరు వ్యక్తి గత కొన్ని రోజుల నుంచి మద్యం సేవించి తిరుగు తున్నట్లు స్థానికులు తెలిపారన్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వృద్ధుడిని ఎవరైనా గుర్తిస్తే తెలియజేయాలని సూచించారు. మృతదేహాన్ని పాతపట్నం ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

ఆమదాలవలస, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గాజులకొల్లివలస గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి దామోదర పద్మ హత్య కేసులో నిందితుడైన సొండి సురేష్‌ను ఆమదాలవలస పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. బుధవారం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. గాజులకొల్లివలసకి చెందిన పద్మ.. భర్త దామోదర కృష్ణ ఇటీవల మరణించడంతో ఇంటి వద్దే కిరాణాషాపు పెట్టుకొని జీవనోపాధి పొందు తోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన సొండి సురేష్ ఆమెతో చనువుగా ఉంటూ.. అవసరానికి డబ్బులు తీసుకునేవాడు. గత మూడు నెలలుగా వీరి మధ్య బేదాభిప్రాయాలు రావడంతో పాటు పద్మను అనుమానిస్తూ సురేష్ వేధించేవాడు. దీంతో ఆమెపై కక్ష పెంచుకున్న సురేష్ ఎలాగైనా పద్మ ను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో పథకం ప్రకారం ఆమెపై దాడి చేసి కత్తి తో పొడిచి చంపేశాడు. అక్కడ నుంచి సంగమేశ్వర కొండపైకి పారిపోయి దాక్కొని, పద్మను చెడ్డ దానిలా చిత్రీకరించేందుకు గతంలో వారి మధ్య జరిగిన ఘటనలు వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి పోస్టు చేశాడు. దీంతో అతడి లోకేషన్ ఆధారంగా సంగమేశ్వర కొండపై ఉన్నట్టు గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా సురేష్ 2023 జూన్‌లో పోలాకి మండలం ప్రియాగ్రహారం చెందిన ఒక మహిళను వేధించాడు. దీనిపై అప్పట్లో పోలాకి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదూనట్టు డీఎస్పీ తెలిపారు. సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ వెంకటేష్, సిబ్బంది ఉన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు


నిందితులతో పోలీసులు

పొందూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్లు, గ్యాస్ సిలిండర్ల దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల తమ ఇళ్లలో గ్యాస్ సిలిండర్లు, మొబైల్ ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై ఎస్‌ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు టెక్కలి మండలం గోపీనాథపురం గ్రామానికి చెందిన కొమ్ము కార్తీక్, గాలి వెంకటశివ, నగిరి నాగరాజును అదుపులోకి తీసుకుని వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, సుమారు 30 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిలో కొమ్ము కార్తీక్, గాలి వెంకటశివ గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన వారని ఎస్‌ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు

● పట్టించుకోని అధికారులు


పూండి స్టేషన్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన దుకాణాలు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రధాన వాణిజ్య కేంద్రమైన పూండి బస్టాండ్, రైల్వే స్టేషన్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదు. ఇరువైపులా ఉన్న స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మించి స్థానికులు కొందరు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. స్థానికంగా ఉన్న కొందరు పెద్దలు కొన్నేళ్లుగా ఈవిధంగా చేస్తున్నా అధికారులు పట్టించు కోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆక్రమిత ప్రదేశాల్లో వ్యాపారులు ఏర్పాటు చేసిన దుకాణాలు రోడ్డుపైకి ముందుకు రావడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

కోతకు గురైన భారీ వృక్షం


వాడవలస గ్రామం వద్ద నది ఒడ్డున కూకటి వేళ్లతో సహా కనిపిస్తున్న భారీ వృక్షం

ఎల్ఎన్‌పేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిత్రంలో చూస్తున్నారుగా.. వంశధార నదిని ఆనుకున్న ఉన్న ఒడ్డు కోతకు గురై భారీ వృక్షం కూకటి వేళ్ల కనిపిస్తున్నాయి. భవిష్యత్‌లో ఏమాత్రం నదికి వరదలు సంభవించినా గ్రామంలోకి నీరు ప్రవేశించే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తు న్నారు. ఈ చిత్రం వాడవలస గ్రామం వద్ద కాగా నదిని ఆనుకుని ఉన్న బసవ రాజుపేట, లక్ష్మీనర్సు పేట, మిరియాపల్లి, వాడవలస, దబ్బపాడు, తురకపేట, ధనుకువాడ, కోవిలాం, చిట్టి మండలం తదితర గ్రామాల వద్ద నది గట్టుకోతకు గురై వరద ముంపునకు గురయ్యే ప్రమాదముందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నదీగట్టును పటిష్ఠం చేయడంతో పాటు వరద ప్రమాదం సంభవించకుండా చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యూటీఎఫ్ రాష్ట్రస్థాయి సాంస్కృతికోత్సవాల్లో ప్రతిభ

కోటబొమ్మాళి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఈనెల 15న విజయవాడలో నిర్వ హించిన రాష్ట్ర సాంస్కృతికోత్సవ పోటీల్లో జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. వీరిలో కోటబొమ్మాళి మండలానికి ఐదు బహుమతులు వచ్చాయని ఆ సంఘం మండల నాయకులు యర్నాగుల వాసుదేవరావు బుధవారం తెలిపారు. కొత్తపల్లి జడ్పీ పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు షణ్ముఖ మాస్టారు మూడు, బడగల చిన్నారావు రెండు బహుమతులు సాధించారన్నారు. నందిగాంకి చెందిన బి.శంకరరావు, పాతపట్నంకి చెందిన చిరంజీవి, టెక్కలికి చెందిన దుర్యోధన ఒక్కొక్క బహుమతులు సాధించారని చెప్పారు. వీరికి జనవరి 5న కాకినాడలో జరిగే స్వర్ణోత్సవ మహాసభలో బహుమతులు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారిని యూటీఎఫ్ నేతలు అభినం దించారు.

రైలు ప్రయాణికులకు చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన


ప్రచారం చేస్తున్న హెల్ప్‌లైన్ సిబ్బంది

పలాస, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికులకు చైల్డ్ హెల్ప్‌లైన్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, జిల్లా బాలల రక్షణాధికారులు, ఆర్పీఎఫ్, రైల్వే పోలీసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. 18 ఏళ్లలోపు బాలబాలికలు ఆపదలో ఉంటే తక్షణం 1098కు సమాచారం అందించాలని, అక్రమ రవాణా జరుగుతున్న పిల్లలు, భిక్షాటన చేసే పిల్లల సమాచారం కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో బాలసరస్వతి, సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు విద్యార్థులు




పలాస, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎస్.గణపతి, ఎస్.ప్రదీప్, ఎస్.వాసుదేవరావు, ఎస్.వంశీ, ఎస్.చంటి, కె.దీపిక ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి తెలిపారు. ఈ పోటీలు చెన్నైలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ కళాశాలల పోటీల్లో వీరు పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యా రన్నారు. ఈ సందర్భంగా వీరిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. జాతీయ స్థాయిలో కూడా జిల్లాకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో శిక్షకుడు పి.మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిఫారసుల మేరకే ఎరువులు వాడాలి

జలుమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్ష పత్రాల్లో సిఫారసు చేసిన మోతాదు మేరకే ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. జోనంకి రైతు సేవా కేంద్రంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించాలన్నారు. చిరు ధాన్యాల సాగు పెంచాలన్నారు. అపరాల్లో నాణ్యమైన దిగుబడికి చేపట్టాల్సిన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులను వివరించారు. ప్రస్తుతం పడుతున్న అకాల వర్షాలకు ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లు కప్పి సంరక్షించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏడీఏ రవీంద్రభారతి, ఏవో కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం


నేతాజీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం ఇసకల పాలెం గ్రామానికి చెందిన వసుపల్లి నేతాజీ అనే బాలుడు అదృశ్యమైనట్టు రూరల్ ఎస్‌ఐ కె. రాము బుధ వారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెద్దపాడు సమీపాన శాస్త్రులపేటలో గల ఏపీబీసీ డబ్ల్యూ స్కూల్‌లో నేతాజీ పదో తరగతి చదువుతూ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 17వ తేదీ ఉదయం 7గంటల నుంచి నేతాజీ కని పించడం లేదని తల్లి దండ్రులకు పాఠశాల అధ్యాపకులు తెలియజేశారు. దీంతో బుధ వారం రాత్రి నేతాజీ తండ్రి ధనరాజ్ రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాము తెలిపారు.

రెండు రోజుల్లో ఫ్లై ఓవర్ పనులు చేపట్టాలి: ఆర్డీవో


కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో వెంకటేష్

కాశీబుగ్గ, డిసెంబర్ 18 (ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే ఫ్లై ఓవర్ పనుల్లో భాగంగా కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్ నుంచి వంతెన నిర్మాణం కోసం దుకాణాలు తొలగించి పనులు చేపట్టాలని ఆర్డీవో డి.వెంకటేష్ ఆర్ అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆయన రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి రైల్వే ఫ్లైఓవర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. రైల్వే ఫ్లైఓవర్ పనుల్లో భాగంగా 89 మంది నిర్వాసితులుండగా దుకాణాలు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు 128 ఉన్నాయన్నారు. వాటిలో 79 మందికి ఇప్పటికే నష్టపరిహారం చెల్లించడం జరిగిందన్నారు. మరో పది మందికి వివిధ కారణాలతో పరిహారం చెల్లించ లేకపోయామన్నారు. వారి పూర్తి వివరాలను గురువారం తహసీల్దార్ కార్యాలయానికి తీసుకొని రావాలని సూచించా మన్నారు. మరో రెండు రోజుల్లో ఆర్అండ్‌బీ అధికారులు కొలతలు తీసుకొని పనులు ప్రారంభించాలని సూచించారు. పరిశీలనలో తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, ఆర్అండ్‌బీ డీఈఈ ఎస్. రామినాయుడు, టీడీపీ నాయకులు చంద్రశేఖర్ త్యాడి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన అవసరం


కాపుతెంబూరులో అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనీ వెంకటాచలం



దండుగోపాలపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నందిగాం/మెళియాపుట్టి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విని యోగదారుల చట్టాలపై విద్యార్థి దశ నుంచి అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల క్లబ్‌ల మాస్టర్ ట్రైనీ లఖినాన వెంకటాచలం అన్నారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా బుధవారం నందిగాం, కాపుతెంబూరు, కరజాడ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థి క్లబ్‌ల ఆధ్వర్యంలో అవగా హన సదస్సులు నిర్వ హించారు. ఆహారకల్తీ, డిజిటల్ లావాదేవీల్లో మోసాలు తదితర అంశాలను వివరించి అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు రాము, ధనలక్ష్మి, ఎల్.వెంకట్రావు, ఉపాధ్యాయులు శ్రీరాములు, గణేష్, రామారావు, ఆదినారాయణ తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

సంతబొమ్మాళి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా హక్కులు, బాధ్యతలపై నినదించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు భాస్కర రావు, వీరభద్రరావు, ఆదికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్ల పోరాటం ఆదర్శం


గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పోలాకి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాకొద్దీ తెల్లదొరతనమంటూ బ్రిటీష్ వారిపై తన గళంతో పోరాటం చేసిన గరిమెళ్ల సత్యనారాయణ నేటి యువతకు ఆదర్శమని ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.విశ్వేశ్వరరావు అన్నారు. జాతీయ గేయకవి, స్వాతంత్ర్య సమరయోధుడు గరిమెళ్ల సత్యనారాయణ వర్ధంతిని బుధవారం స్థానిక పాఠశాల ఆవ రణలో నిర్వహించారు. గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గరిమెళ్ల రచనలు, గేయాలతో బ్రిటీష్ వారిని గడగడ లాడించారన్నారు. శ్రీకాకుళం జిల్లాకు గరిమెళ్ల పేరు పెట్టాలని జయంతి, వర్ధంతి కమిటీ నాయకులు ఇలపండ గణపతిరావు కోరారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గరిమెళ్ల నాగమణి, నిర్వాహకులు బాడాన రాజు, దుబక కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాటలతో చైతన్యం తెచ్చిన గరిమెళ్ల

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టేందుకు గరిమెళ్ల సత్యనారాయణ తన పాటలతో విప్లవ సాహిత్యాన్ని సృష్టించారని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు అన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు వీజీకే మూర్తి ఆధ్వర్యంలో గరిమెళ్ల వర్ధంతిని బుధవారం కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ రాజా మాట్లాడుతూ.. గరిమెళ్ల సత్యనారాయణ మన జిల్లా వాసి కావడం గర్వకారణమన్నారు. గరిమెళ్ల మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ.. గరిమెళ్ల సాహితీవేత్త అని, ప్రభుత్వాలు గరిమెళ్లకు తగిన గుర్తింపు ఇవ్వాలని కోరారు. గరిమెళ్ల తన సాహిత్యంతో దేశంకోసం విదేశీయులపై గేయాలు ఆలపిస్తూ చైతన్యం తెచ్చారన్నారు. గరిమెళ్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.ప్రభాకరరావు, పి.సుధాకర రావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.


మాట్లాడుతున్న వీజీకే మూర్తి

మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలి


ఐటీడీఏ ఏర్పాటు చేయాలని నినదిస్తున్న సీపీఐఎంఎల్ నేతలు

టెక్కలి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఐటీడీఏను ఏర్పాటు చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు అన్నారు. బుధవారం మొఖలింగాపురం పంచాయతీలో ఆదివాసీ గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ సమస్యల తక్షణం పరిష్కరించాలన్నారు. జిల్లా విభజనలో సీతంపేట పార్వతీపురం మన్యం జిల్లాలోకి వెళ్లిపోవడంతో శ్రీకాకుళం జిల్లాలోని ఏడు సబ్ ప్లాన్ మండలాలు, మిగిలిన మండలాల్లో కూడా గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెండున్నర లక్షల ఆదివాసీ జనాభా ఉన్నా ఐటీడీఏ లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గిరిజన గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, గిరిజనేతరులను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నేతలు భీమారావు, సోమేశ్వరరావు, ధర్మ, దేవేందర్, రామారావు, సూరమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో ఆర్ఆర్‌బీ అభ్యర్థులకు ఇబ్బందులు



నరసన్నపేట, డిసెంబరు 18: ఆర్ఆర్‌బీ సికింద్రాబాద్ బోర్డు నిర్వహిస్తున్న టెక్నికల్ ఇంజనీరింగ్, డీఎంఎస్, సీఎంఏ, సీఎస్, ఎంఎస్ ఉద్యోగాలకు పరీక్ష కేంద్రంగా నరసన్నపేట కోర్ టెక్నాలజీకి కేటాయిం చారు. ఈ కేంద్రంలో మూడు షిఫ్టులలో బుధవారం నుంచి పరీక్షలు నిర్వహించారు. ఇరు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు హాజరయ్యారు. అయితే బుధవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతుండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కేంద్రం బయట ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో వర్షంలో అభ్యర్థులు ఇక్కట్లకు గురయ్యారు. పరీక్ష సమయానికి సుమారు గంటన్నర ముందు అభ్యర్థులు కేంద్రానికి చేరుకున్నారు. ఒక చిన్న టెంట్ మాత్రమే వేయడంతో వర్షానికి అందులో ఇరుక్కుని ఇక్కట్లకు గురయ్యారు. మరో వైపు సెల్‌ఫోన్, బ్యాగులను భద్రపరిచేందుకు అభ్యర్థుల నుంచి రూ.20 చొప్పున నిర్వాహకులు వసూలు చేసినట్లు పలువురు అభ్యర్థులు చెబుతున్నారు. పరీక్ష కేంద్రాల బయట ఫొటోలు తీసేందుకు పలువురు ప్రయత్నించగా వారిని నిర్వాహకులు ఫొటోలు తీయవద్దంటూ హుకుం జారీ చేయడంపై విమర్శలు వినిపించాయి. మూడు షిప్టులలో సుమారు 450 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు.

న్యూస్ బాక్స్

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

జలుమూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నుకున్నారు. ఎంపీడీవో కె.అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎం.లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా ఎస్.చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.హరీష్, ట్రెజరర్‌గా డి.గోపిక, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పి.అరుణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఎంపీడీవోతో పాటు ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, పలువురు కార్యదర్శులు తదితరులు అభినందించారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు

టెక్కలి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు కలుగుతాయని, వీటిని దూరంగా ఉండాలని ఏబీవీపీ ప్రతినిధి మురళి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో విద్య కోసమే ఆలోచించాలని, జీవితం నాశనం చేసే వాటి పైకి దృష్టి మరల్చవద్దన్నారు. ఎస్‌ఐ రాము మాట్లాడుతూ.. విద్యార్థులు లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడపకూడదని, త్రిబుల్ రైడ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మదన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ఫిర్యాదులకు స్వస్తి పలకాలి

పాతపట్నం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్ పీవోపై సీఎంవోకి పలువురు తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని, వీటికి స్వస్తి పలకాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు కోరారు. స్థానిక శివ శంకర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం బి.శాంతామణి, యు.లీలారాణి, ఎస్.శారద తదితరులు విలేకరు లతో మాట్లాడు తూ.. పీవోపై కేటీ కృష్ణారావు పేరుతో తప్పుడు ఫిర్యాదులు చేయడం తగదన్నారు. దీనివల్ల కార్యకర్తలు, సిబ్బంది ఆందోళన చెందుతున్నారన్నారు. తప్పుడు ఫిర్యాదులపై శాఖ ఉన్నతాధికారులు విచారణ పేరిట కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారన్నారు. ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చొరవచూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు యు.ఉష, జి.గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

స్మారక సభను విజయవంతం చేయండి

పలాసరూరల్,డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం పెదపాడులో ఈనెల 22న విప్లవ కవి సుబ్బారావు పాణిగ్రాహి 55వ వర్ధంతి సందర్భంగా నిర్వహిస్తున్న స్మారక సభను విజయవంతంచేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. మామిడిపల్లి గ్రామంలో బుధవారం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుకూలీ సంఘం ప్రతినిధులు వంకల కామరాజు, వంకల పున్నయ్య, ఎం.రాజారావు, ఎం.గంగ య్య, వంకల తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో టార్పాలిన్లు

జలుమూరు, డిసెంబరు 18: (ఆంధ్రజ్యోతి) స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో టార్పాలిన్లను రైతులకు అందుబాటులో ఉంచామని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జన్ని రామారావు తెలిపారు. కార్యాలయంలో బుధవారం వీఆర్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వాయుగుండం ప్రభావం వల్ల మండలంలో అడపా దడపా వర్షం పడుతున్నందున కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు టార్పాలిన్లను అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ముందుగా రూ.650 డిపాజిట్ కట్టి తీసుకు వెళ్లా లన్నారు. అవసరం తీరిన తరువాత వాటిని అందిస్తే డిపాజిట్ సొమ్ము తిరిగి ఇస్తామ న్నారు. వర్షాలకు వరి చేను, ధాన్యం తడిచిపోకుండా టార్పాలిన్లతో సంరక్షించుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఐ కిరణ్, వీఆర్వోలు, పాల్గొన్నారు.

పరదాలు సద్వినియోగం చేసుకోవాలి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాయుగుండం నేపథ్యంలో ధాన్యం తడిచిపోతున్న రైతులు రూ.650 చెల్లించి పరదాలు పొందవచ్చని వ్యవసాయాధికారి కిరణ్ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం తగ్గిన తరు వాత పరదాలు తిరిగి ఇచ్చి డిపాజిట్ పొంద వచ్చన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.